క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ రాంరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం అంత్యక్రియల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని నివాళులర్పించారు. అంతకుముందు రాంనగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ మనోహర్ తల్లి దినకర్మ కార్యాక్రమంలో పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం

అడ్డాకుల: తెలంగాణ రాష్ట్రం వస్తే అన్ని వర్గాలు బాగుపడతాయని అనుకుంటే సీఎం కేసీఆర్ అందరినీ మోసం చేస్తున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మూసాపేట మండలం వేములలో మంగళవారం నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో ఏటా రూ.45వేల కోట్లను మద్యం ద్వారా ఖజానా నింపుకుంటున్నారని, గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా ప్రజల జేబులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సింహులు, రవీందర్‌రెడ్డి, బాలనర్సింహులు, బాలమణెమ్మ, భరత్‌భూషన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



కోయిల్‌కొండ: గ్రామ పంచాయతీలో అభివృద్ధికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నపల్లితండాలో క్రీడాప్రాంగణం కోసం స్థల సేకరణ చేశారు. గ్రామస్తులు స్థలాన్ని కేటాయించకపోవడంతో అధికారులు మాట్లాడారు. క్రీడాప్రాంగణం ఏర్పాటుతో గ్రామంలోని యువకులకు క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని అవగాహన కల్పించారు. సర్పంచ్ చక్రధర్, పంచాయతీ కార్యదర్శి సోహెల్, ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలం ప్రకటించాలని సంతకాల సేకరణ



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను విరమించేదిలేదని జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగుపల్లి, గంగ్యానాయక్‌తండాల్లో ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. మండలం సాధించే వరకు మండల సాధన ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా అంజయ్య

దేవరకద్ర: పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా అంజయ్యను ఎన్నుకున్నారు. మంగళవారం దేవరకద్రలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రఘువర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి, నాయకులు అశ్విని చంద్రశేఖర్, పురేందర్‌రెడ్డి, నాగేశ్వర్, తరుమల్, సుదాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు పేద, మధ్యతరగతి ప్రజల నుంచి అధిక ఫీజులు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తూ దోపిడికి తెరతీశారని, ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్‌లు మాట్లాడుతూ కల్వకుర్తిలో ప్రైవేట్ ఆస్పత్రులు మాఫియాగా మారాయని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

బీటీ రోడ్లకు మరమ్మతు



గుంతలమయంగా మారిన రాయపల్లి రోడ్డు

- రూ.9.36కోట్ల నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మరమ్మతులకు మంజూరైన నిధులు..

గ్రామాలు	నిధులు
బూర్గులగేట్ - లింగారం	రూ.78 లక్షలు
గుండేడ్ - చౌక్కంపేట్	రూ.1.50లక్షలు
బూర్గులగేట్ - సూరారం	రూ.5.00కోట్లు
చిన్నరేవల్లి - తొమ్మిదిరేకుల	రూ.73లక్షలు
ముదిరెడ్డిపల్లి - రాయపల్లి	రూ.60లక్షలు
మల్లేపల్లి - ఈద్గాన్‌పల్లి	రూ.75లక్షలు

రాజాపూర్: గ్రామాల అభివృద్ధిలో భాగంగా రవాణా సౌకర్యం కూడా ఎంతో ముఖ్యం. గ్రామాలకు ఉన్న బీటీ రోడ్లు దెబ్బతినడంతో వాటిని గుర్తించి వెంటనే మరమ్మతు చేయించేందుకు దెబ్బతిన్న రోడ్లకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాజాపూర్ మండలంతో పాటు బాలానగర్ మండలాల్లోని గ్రామాలకు రూ.9.36కోట్ల నిధులు మంజూరు కావడంతో రాయపల్లి, మల్లేపల్లి గ్రామాల మినహా గ్రామాల రోడ్ల మరమ్మతు చేసేందుకు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో రోడ్లు దెబ్బతిని వాహనదారులు, తమ వాహనాలు దెబ్బతినడంతో పాటు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక నుంచి సమస్యకు పరిష్కారం కానుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు గ్రామాలు మినహా టెండర్లు పూర్తి..

మండలంలోని రాయపల్లి, ఈద్గాన్‌పల్లి గ్రామాల రోడ్లకు మినహా మిగతా గ్రామాలకు బీటీ రోడ్లకు మరమ్మతు చేసేందుకు టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. మిగిలిన రెండు గ్రామాల రోడ్డు పనులకు ఈనెల 21వ తేదీలోగా టెండర్లు పూర్తి చేస్తాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈఈ పీఆర్

గుంతలరోడ్డులో ప్రయాణం..



ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లి వరకు గుంతలరోడ్డుపై ప్రయాణమంటేనే భయమేస్తుంది. రాత్రి వేళలో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనులు త్వరగా ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలి.

– నవీన్‌గౌడ్, రాయపల్లి

ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు..



జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. గ్రామాల సమస్యలపై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధిని ఎప్పటికీ మరువం. గ్రామంలో సీసీరోడ్లు కూడా పూర్తి చేసుకుంటున్నాం.

– కొప్పెరి బచ్చిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, రాజాపూర్

ఘనంగా తెలుగుభాష దినోత్సవం



పద్యాలు చదివి వినిపిస్తున్న విద్యార్థి

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ పాటలు, పద్యాలు, నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు రామాయణం, మహాభారతంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు రవిశంకర్, చక్రవర్తి గౌడ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

పాలమూరు: వరంగల్ జిల్లాలో హాత్ సే హాత్ జోడో యాత్రలో బీఆర్ఎస్ గుండాలు వరంగల్ యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై చేసిన దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు లక్ష్మణ్ యాదవ్, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబ, రాఘవేందర్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కొండా బుచ్చిరెడ్డి

హన్వాడ: వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండాబు బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి గుడ్డిమల్కాపూర్‌లో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిని ఎండగట్టాలని సూచించారు. పంచాయతీల్లో కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు చేపడుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, బీజేపీ మహబూబ్‌నగర్ టౌన్ ప్రెసిడెంట్ అంజయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేందుకు కుట్ర

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సమస్త కార్మికవర్గాల సమస్యలకు దారి చూపేది కమ్యూనిస్టు మేనిఫెస్టో అని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే కుట్ర జరుగుతుందని న్యాయవాది బెక్కెం జనార్దన్ అన్నారు. రెడ్‌బుక్ డేను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకికవాదులు, అభ్యుదయవాద శక్తులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే కుట్రలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, డాక్టర్ విజయ్‌కాంత్, నాయకులు ఆర్.రామ్‌రెడ్డి, కిల్లిగోపాల్, రాములు, చంద్రకాంత్, పద్మ, అనురాధ, వరద గాలెన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

జడ్చర్ల: వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు షర్మిల చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ హిజ్రాలు మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై వైఎస్ షర్మిల చేసిన ఆరోపణల నేపథ్యంలో తమను ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. హిజ్రాల అసోసియేషన్ అధ్యక్షురాలు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



గండేడ్: మండలంలోని వెన్నాచెడ్, చెలిమిల్ల గ్రామాల్లో మంగళవారం శ్రీసత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 30పశువులకు గర్భకోశ పరీక్షలు, 70 దూడలకు నట్టల నివారణ మందులను, 15 పశువులకు సాధారణ చికిత్సలను పశు వైద్యులు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పున్నయ్య, రాంప్రసాద్, మంగమ్మ, సమీర్, రాములు, మల్లయ్య, అంజి, నిరంజన్, శివలింగంరమణయ్య, బుగ్గయ్య, సుభాష్, శివలింగప్ప పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

మరికల్: లారీ ఢీకొనడంతో మహిళ గాయపడిన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే.. మరికల్‌లో తెల్లవారుజామున ఇసుములోడుతో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి పడమటి ఆంజనేయస్వామి ఆలయ ముందుభాగాన్ని ఢీకొట్టుకుంటూ హోటల్‌లో పనులు చేయడానికి వెళ్తున్న తిరుపతమ్మను ఢీ కొంది. అదుపు తప్పిన లారీ బారికేడ్లను తొక్కుకుంటూ అలాగే రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి వెళ్లింది. ప్రమాదంలో తిరుపతమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో ఆమెను ఈ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మార్కెట్ చైర్మన్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర శ్రీనివాస గార్డెన్‌లో జరిగిన మార్కెట్ కమిటీ పాలక వర్గం సన్మాన సభలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు పెద్దపీట వేశారని అన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో పాటు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం, సాగునీటి కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం, ఉచితంగా కరెంట్ ఇవ్వడంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని వెల్లడించారు. ఎందరో ఉద్యమకారులు త్యాగ ఫలితమే తెలంగాణ అని, సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ.లక్ష ఇస్తున్న రాష్ట్రం తెలంగాణనే అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చిందని ప్రశ్నించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి..

దేవరకద్ర మార్కెట్‌కు ఎన్నికైన నూతన పాలకవర్గ మండలి రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలని కోరారు. వ్యాపారులకు, రైతులకు అనుసంధానంగా కమిటీ పని చేయాలని కోరారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ విజయ వెంకటేశ్, వైస్ చైర్మన్ దశరథరెడ్డి, ఎంపీపీలు రమాదేవి, హర్షవర్దన్ రెడ్డి, జెడ్పీటీసీలు అన్నపూర్ణ, రాజేశ్వరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చిన్నచింతకుంట అధ్యక్షుడు రాము, సింగిల్ విండో చైర్మన్లు నరేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

దేవరకద్ర: మండలంలోని గూరకొండకు చెందిన 50మంది కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. పెద్దబిక్షం, గట్టన్నలతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.

విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలు ఇవ్వండి

జడ్చర్ల టౌన్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకునేందుకు ఉచితంగా ఖాతాలు ఇవ్వాలని జడ్చర్లలోని పలు బ్యాంక్ మేనేజర్లను డీఈఓ యాదయ్య కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు. సమావేశం అనంతరం కొందరు విద్యార్థులతో అక్కడే బ్యాంక్ ఖాతాలు తెరిపించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్ రావటం వల్ల వారి చదువులకు ఎంతో మేలు ఉంటుందని బ్యాంక్ అధికారులకు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న బ్యాంకు అధికారులు సహకరించాలని కోరారు. ధ్రువపత్రాలన్నింటినీ త్వరితగతిన ఇవ్వాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను కోరారు. కలెక్టర్‌కు సైతం విషయాన్ని తెలిపామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి పాల్గొన్నారు.



ఎమ్మార్సీలో బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయిస్తున్న డీఈఓ యాదయ్య

వరిలో యాజమాన్య పద్ధతులు అవసరం



లాల్‌కోటలో మాట్లాడుతున్న ఏడీఏ యశ్వంత్‌రావు

చిన్నచింతకుంట: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు సాధించాలని దేవరకద్ర వ్యవసాయ ఏడీఏ యశ్వంత్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని లాల్‌కోట రైతువేదికలో వరిసాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతిలో పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. వరిసాగులో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుందన్నారు. నివారణకు క్లోరిపైరిపాస్ ఎకరాకు 400 మిల్లీలీటర్ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే యాసంగి సాగులో జింక్‌లోపం ఎక్కువగా ఉంటుందన్నారు. జింగ్ లోపం వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి 5రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనీల్‌రెడ్డి, రైతుబంధు కో ఆర్డినేటర్ దశరథ్, రైతులు రాము, కృష్ణయ్య, శివ పాల్గొన్నారు.

పంచాయతీలపై అదనపు భారం



గాధిర్యాల్ మెగాపార్కులో నాటిన మొక్కలు

- సమీపిస్తున్న గడువు.. పెరగని హరితహారం మొక్కలు
- మార్చితో ముగియనున్న వర్క్ ఐడీ
- నిధుల లేమితో అవస్థలు పడుతున్న సర్పంచ్‌లు



హరితహారం మొక్కల వద్ద కలుపు తొలగిస్తున్న కూలీలు

మహమ్మదాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమంతో పాటు పల్లె ప్రకృతివనాలు, మెగా పార్కుల ద్వారా మొక్కలు పెంచాలన్న లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉపాధి హామీ పథకం ద్వారా పార్కులు, పల్లెప్రకృతి వనాల ద్వారా మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టింది. మొక్కలను పెంచేందుకు వినియోగించే నిధులకు సంబంధించి వర్క్ ఐడీ మార్చితో గడువు ముగియనుంది, దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లో 49 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో సుమారు 351సైట్లలో 2.52లక్షల మొక్కలను పెంచారు. నాటిన ప్రతి మొక్కకు రెండు సంవత్సరాల వరకు రక్షణ, నీరు, పెంపకం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. ఆయా గ్రామాల్లో నాటిన మొక్కలకు సంవత్సర కాలానికే ఉపాధి హామీ వర్క్ ఐడీ సమయం ముగియడంతో లక్షల్లో మొక్కలు ఎండి పోయే ప్రమాదమున్నది.

29 గ్రామాల్లో 2.52లక్షల మొక్కలు..

ఉమ్మడి మండలంలోని గాధిర్యాల్, పంచలింగాల్ తండా, గోవింద్‌పల్లి, కప్లాపూర్ తదితర గ్రామాల్లో పల్లెప్రకృతి వనాల్లో, మెగా పార్కుల్లో 2.52లక్షల మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంవత్సర కాలమే గడుస్తుంది. మొక్కలు పూర్తిగా ఎదగడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పడుతుంది. నిధులు వచ్చే మార్చిలోపు నిలిచిపోనున్నందునా గ్రామ పంచాయతీలపై భారం పడనుంది. ఇప్పటికే నిధుల లేమితో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని, మొక్కల సంరక్షణకు నిధులు ఎక్కడి నుంచి ఖర్చు చేస్తామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ భారమవుతుంది..



నిధులు లేక గ్రామ పంచాయతీల నిర్వహణ ఇప్పటికే భారమవుతుంది. మెగాపార్కు ఎస్టిమేషన్ ప్రకారం పూర్తి నిధులు గ్రామాలకు ఇవ్వాలి. అప్పుడే మొక్కలను బతికించుకునే అవకాశం ఉంటుంది.

– వెంకట్రాంరెడ్డి, సర్పంచ్, గాధిర్యాల్

మరో ఏడాది పొడిగించాలి..



ఉపాధిహామీ ద్వారా నాటిన మొక్కలను బతికించుకునేందుకు చిన్న గ్రామ పంచాయతీల నిధులు ఎలా సరిపోతాయి. ఇప్పటికే నిధులు చాలక ఎన్నో అవస్థలు పడుతున్నాం. నాటిన మొక్కలన్నీ బతికించుకోవాలంటే మరో సంవత్సరం పాటు సమయం కావాలి.

– రవీందర్, సర్పంచ్, గోవింద్‌పల్లి

నిబంధనలు తప్పనిసరి..



మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నాటిన మొక్కలకు వచ్చే మార్చి నాటికి వర్క్ ఐడీ పూర్తవుతుంది. అప్పటి నుంచి మొక్కల పెంపకం నిర్వహణ గ్రామ పంచాయతీలే చూసుకోవాల్సి వస్తుంది. నిర్వహణ సమయం పెంచే నిర్ణయం ప్రభుత్వం చేతుల్లో ఉన్నది.

– రూపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, గండేడ్